ఆధ్యాత్మిక చింతనతోనే సమాజంలో శాంతి : ఎమ్మెల్యే


తులసి కల్యాణం పూజలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దంపతులు, వారి కుమార్తె డాక్టర్ దీప్తి కాలేరు

నల్లకుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే సమాజంలో శాంతి నెలకొంటుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. కార్తీకపౌర్ణమి మనిషిలో అజ్ఞానాన్ని పారద్రోలి ఆత్మను కాంతితో ప్రకాశింపచేస్తుందన్నారు. బుధవారం ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆయన సతీమణి కాలేరు పద్మావెంకటేష్, వారి కుమార్తె డాక్టర్ దీప్తి కాలేరులు తులసి కల్యాణం పూజ నిర్వహించారు. ఆలయంలో వేదపండితుడిచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుఖసంతోషాలంతో ప్రశాంతంగా ప్రజలు జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ముందుగా కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని తెల్లవారుజామున ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సామాజిక సేవతోనే సంతృప్తికరమైన జీవితం

బర్కత్‌పుర, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవా కార్యక్రమాలతోనే సంతృప్తికరమైన జీవితం లభిస్తుందని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆగిరి వెంకటేష్ అన్నారు. ఆర్యవైశ్య సంఘం ఇసామియాబజార్ అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్‌గుప్తా అధ్యక్షతన బుధవారం కాచిగూడలో చేయూత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు నెలవారి పెన్షన్‌తో పాటు నెల రోజులకు సరిపడ కిరాణా సామగ్రిని పంపిణీ చేశారు. శీతకాలం సందర్భంగా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బి.శ్రీధర్ ఆధ్వర్యంలో 22మందికి దుప్పట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేష్, నిఖిలేశ్వర్, అనిల్, బి.అనిల్‌కుమార్, ఎర్రం లక్ష్మణ్ పాల్గొన్నారు.

25న మత్స్యకారుల బహిరంగ సభ

రాంనగర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మత్స్యకార్మిక సంఘం 4వ రాష్ట్ర మహాసభలు ఈనెల 25, 26, 27వ తేదీల్లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ, ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ తెలిపారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో మహాసభ పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 25న గీత భవన్ చౌరస్తా నుంచి రెవెన్యూ గార్డెన్ వరకు మత్స్యకారుల మహాప్రదర్శన, అనంతరం బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి పులి వెల్ల స్టాన్లీ పాల్గొంటారని వారు తెలిపారు. 33 జిల్లాల నుంచి 500 మంది ప్రతినిధులు ఈ మహాసభకు హాజరవుతారని వారన్నారు. కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎం.వి.రమణ, కార్యదర్శి కొప్పు పద్మ, నాయకులు అమరావతి, బాలమణి, ఈగలక్ష్మణ్, వెంకటేష్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే రాష్ట్ర బంద్ నిర్వహిస్తాం : బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ

రాంనగర్ : రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను 15లోగా విడుదల చేయకపోతే రాష్ట్ర బంద్ నిర్వహిస్తామని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహరాజ్, రాష్ట్ర కో-కన్వీనర్లు రాచాల వినోద్‌యాదవ్, రాఘవేందర్ ముదిరాజ్‌లు హెచ్చరించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని జేఏసీ కార్యాలయంలో సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల కళాశాలలు బంద్ పాటిస్తున్నాయని, దీని వల్ల నష్టపోయేది బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులేనని, దీనికి సీఎం సమాధానం చెప్పాలన్నారు.


షేక్‌పేటలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతతో కలిసి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, బింగి నవీన్, శ్రీనివాస్‌రావు

జూబ్లీహిల్స్ ప్రజల మద్దతు బీఆర్ఎస్‌కే : జైసింహ

ముషీరాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అన్నివర్గాల ప్రజల మద్దతు బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకే లభిస్తున్నదని ఆ పార్టీ యువ నాయకుడు ముఠా జైసింహ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ముఠా జైసింహ సారథ్యంలో బీఆర్ఎస్ నేతలు షేక్‌పేటకు తరలివెళ్లి మాగంటి సునీతతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ మాట్లాడుతూ కాంగ్రెస్ ఓటమి భయంతో బీఆర్ఎస్ నేతలపై దాడులకు యత్నిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికార దాహంతో పోలీసులచే బీఆర్ఎస్ నేతలపై ఒత్తిడి తీసుకువచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బింగి నవీన్, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకుడు షరీఫ్, నాయకులు శంకర్‌గౌడ్, ఉమాకాంత్, సుమన్, సాయి చాణిక్యారెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ని గెలిపించాలి : నాగభూషణం



రాంనగర్ : అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు, రాష్ట్ర అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషి చూసి జూబ్లీహిల్స్‌లో ఆ పార్టీని ప్రజలు గెలిపించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జి.నాగభూషణం కోరారు. రెండు సంవత్సరాల రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు ప్రజల సంక్షేమం కొనసాగుతుందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం సమగ్రాభివృద్ధి కోసం ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్, బీజేపీ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని అన్నారు. నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలందరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు.

నవీన్‌యాదవ్‌కు సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌సేన మద్దతు


దిడ్డి రాంబాబు

రాంనగర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌సేన మద్దతు ప్రకటిస్తున్నట్లు సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌సేన జాతీయ అధ్యక్షుడు, కాంగ్రెస్ జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు తెలిపారు. ఈనెల 11న జరిగే ఎన్నికల్లో తమ సేన సభ్యులందరూ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు ఓట్లు వేసి గెలిపించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్‌కి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రచారం కోసం తమ సేన చేస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజల నుంచి కాంగ్రెస్‌కి మంచి స్పందన లభిస్తుందని, నవీన్‌యాదవ్ గెలుపు తథ్యం అని దిడ్డి రాంబాబు ధీమా వ్యక్తం చేశారు.

రుణమాఫీ, చేనేత సమస్యలు పరిష్కరించాలి

● 20న కమిషనర్ కార్యాలయం ఎదుట మహాధర్నా


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు

రాంనగర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రుణమాఫీ, చేనేత సమస్యలు పరిష్కరించాలని ఈనెల 20న కమిషనర్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు పేర్కొన్నారు. బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో కార్యాలయం ఎదుట మహాధర్నా కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సిరిసిల్లలో వర్క్ టూ ఓనర్ పథకం పూర్తిచేసి పవర్ లూమ్ కార్మికులకు అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వనం శాంతికుమార్, గంజి మురళీధర్, లెల్లెల బాలకృష్ణ, నరహరి, చెరుకుస్వామి, అబ్దుల్ వాహీద్, షేక్ షావలి, రమణ పాల్గొన్నారు.

ఆలయాలకు కార్తీకశోభ

శివన్నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

ముషీరాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం ముషీరాబాద్‌కు కార్తీకశోభ సంతరించుకుంది. ఉదయం నుంచి శివాలయాల్లో స్వామివారికి ఉసిరి, పిండి ప్రమిదలతో స్వామివారికి దీపారాధన చేశారు. ఆలయాల్లో శివలింగాలకు పాలాభిషేకం చేశారు. భోలక్‌పూర్‌లోని భవానీశంకర ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సామూహిక సత్యనారాయణ స్వామివ్రతం, అభిషేకాలకు ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్ ఆర్ కల్పనయాదవ్‌లు హాజరై స్వామివారికి పాలాభిషేకం చేసి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ, ఈవో జ్యోతి ఏర్పాట్లు చేశారు. ముషీరాబాద్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దీన్‌దయాల్‌రెడ్డి దంపతులు, బల్లా ప్రశాంత్ దంపతులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు జనిగె శ్రీనివాస్‌యాదవ్, పట్నం నాగభూషణంగౌడ్, మురళీమోజేష్, అభిషేక్ పాల్గొన్నారు. ముషీరాబాద్ మహంకాళి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆలయ కమిటీ చైర్మన్ నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వై. చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.


ఆంజనేయస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, మేడి సురేష్‌కుమార్, ఈవో జ్యోతి


వేంకటేశ్వరస్వామి ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న జంటలు

కనులపండువగా సత్యనారాయణస్వామి వ్రతాలు

చిక్కడపల్లి: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు కనులపండువగా నిర్వహించారు. 125 జంటలు, భక్తులు పెద్దఎత్తున హాజరై వ్రతాలు నిర్వహించారు. సాయంత్రం కార్తీకమాసం సందర్భంగా దీపాలంకరణ జరిగింది. పెద్దఎత్తున మహిళలు హాజరై దీపాలు వెలిగించారు. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు జి. రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె. రామాంజనేయులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివేక్ నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో 115 జంటలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ జానకి సుధాకర్, ఈవో దేవనాథం, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి ఆలయంలో బుధవారం సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించగా 80జంటలు పాల్గొన్నారు. ఆలయ ఈవో లక్ష్మారెడ్డి, చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

వైభవంగా మహాదేవుని రుద్రాభిషేకం


పూజలు చేస్తున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, చైర్మన్ సురేష్‌కుమార్, కల్పనయాదవ్

కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి ఆలయం ఆవరణలోని పార్వతీక్షీరలింగేశ్వరస్వామి మందిరంలో బుధవారం మహాదేవుని రుద్రాభిషేకం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ పాల్గొని శివుడికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, ఈవో లక్ష్మారెడ్డి తీర్థప్రసాదాలు అందజేశారు. భవాని, నవీన్, వేణు, నర్సింహ, సాయిబాబా పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న మామిడి సోమయ్య తదితరులు

చిక్కడపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కోర్టు తీర్పులతో సంబంధం లేకుండా జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ విజ్ఞప్తి చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావొస్తున్నా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడం విచారకరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు అన్నారు. బుధవారం త్యాగరాయగానసభలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జర్నలిస్టులు ఇళ్ల స్థలాలు సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీకి స్థలం కేటాయించాలని సమావేశం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతూ తీర్మానించింది. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, సీనియర్ జర్నలిస్టులు షోయబుల్లాఖాన్, సారంగపాణి, పులిపలుకుల ఆనందం, జగన్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సొసైటీ కార్యదర్శి బి.శ్రీనివాస్ నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు తీగవరపు శాంతి, నాగవాణి, సొసైటీ కోశాధికారి తన్నీరు శ్రీనివాస్, డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు, భాస్కర్‌రెడ్డి, గజ్జల వీరేశం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో మంగళసూత్రం పోయిందని ఫిర్యాదు

బర్కత్‌పుర : ఆర్టీసీ బస్సులో బంగారు మంగళసూత్రం దొంగలు తస్కరించారని ఓ ప్రైవేటు ఉద్యోగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు ఆమె ఇంట్లో తనిఖీ చేయగా బంగారు మంగళసూత్రం లభించింది. ఈ సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. డీఐ మల్లేశం తెలిపిన వివరాల ప్రకారం.. ఇసామ్యా బజార్‌లో నివాసం ఉంటున్న సురేష్ భార్య రమాదేవి(38) కోఠిలోని హెల్త్‌కేర్ సెంటర్లో ఉద్యోగం చేస్తుంది. విధులకు వెళ్లే క్రమంలో రమాదేవి నాలుగున్నర లక్షల విలువైన మూడున్నర తులాల బంగారు మంగళసూత్రాన్ని ఇంట్లోనే మర్చిపోయి హడావుడిగా డ్యూటీకి ఆర్టీసీ బస్సులో వెళ్లింది. మెడలో మంగళసూత్రం కనిపించలేదు, బస్సులో వెతికినా ఆ తర్వాత హెల్త్‌కేర్ సెంటర్‌కు వెళ్లి వెతికినా మంగళసూత్రం కనిపించలేదు. రమాదేవి కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజ్ పరిశీలించారు. ఫలితం లేకపోయింది. బుధవారం సాయంత్రం రమాదేవి ఇంట్లో తనిఖీ చేయగా బెడ్ వద్ద మంగళసూత్రం కనిపించింది. ఇది తనదేనని రమాదేవి ఒప్పుకుంది.


కార్తీకమాసం పురస్కరించుకుని జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రామానుజులరెడ్డి బుధవారం అయ్యప్పస్వామి మహాపడిపూజ నిర్వహించారు. ఈ పూజలో అయ్యప్పస్వాములు భక్తిగీతాలను ఆలపించారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి



ఐఎఫ్‌డబ్ల్యూజే స్ఫూర్తితో జర్నలిస్టుల సమస్యలపై పోరాటం

● ఘనంగా వజ్రోత్సవాలు


కేక్ కట్ చేస్తున్న సీనియర్ జర్నలిస్టులు

చిక్కడపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడిన ఘన చరిత్ర ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్‌డబ్ల్యూజే) సంఘానిదేనని పలువురు వక్తలు అన్నారు. ఈ సంఘం దేశంలోనే మొట్టమొదటి జర్నలిస్టు సంఘం అని వారు అన్నారు. ఐఎఫ్‌డబ్ల్యూజే ఆవిర్భవించి 75వసంతాలు పూర్తైన సందర్భంగా బుధవారం త్యాగరాయగానసభలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి వజ్రోత్సవాలు జరిపారు. ఈ వేడుకల్లో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుకుల ఆనందం, ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్, కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అశోక్‌కుమార్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ ఐఎఫ్‌డబ్ల్యూజే దేశంలోనే తొలి జర్నలిస్టు యూనియన్ అని 1950 అక్టోబరు 28న ట్రేడ్ యూనియన్‌గా ఏర్పడిందని అన్నారు. ఈ వేడుకల్లో ఫెడరేషన్ నాయకులు పాండురంగారావు, బి. శ్రీనివాస్, నాగవాణి, శ్రీనివాస్‌గౌడ్, పర్వతాలు పాల్గొన్నారు.


శ్రీలంకలో ఈనెల 6,7వ తేదీల్లో జరగనున్న అంతర్జాతీయ క్రీడా సదస్సుకు కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.లక్ష్మయ్య పాల్గొంటున్న సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కొలంబోకు బుధవారం ఆయన బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా జూనియర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.సోమేశ్వరరావు, డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.బాల్‌రాజ్, డాక్టర్ ఎం.పర్వతాలుగౌడ్, జె.బాబులాల్, కృష్ణారావులు డాక్టర్ బి.లక్ష్మయ్యకు శాలువాకప్పి పూలబొకే అందజేసి ఘనంగా సత్కరించారు. - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి



డ్రగ్స్ ముఠా కోసం ఎక్సైజ్ పోలీసుల గాలింపు

ముషీరాబాద్ : ముషీరాబాద్‌లో డ్రగ్స్ కేసులో ఎక్సైజ్ పోలీసులకు డాక్టర్ జాన్‌పాల్ దొరికిన విషయం విదితమే. అతని స్నేహితుల కోసం ముషీరాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. వారి ఫోన్‌లను ట్యాపింగ్ చేసి లోకేషన్ గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. డిల్లీ, బెంగళూర్ నుంచి ఓజీ, ఎండిఎంఏ, కొకైన్, హాష్ ఆయిల్, గంజాయి తదితర వాటితో దందా చేస్తున్న ఆ ముగ్గురిని ఎలాగైనా పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ఎంఎంటీఎస్ రైలులో సెల్‌ఫోన్లు చోరీ

బర్కత్‌పుర: ఎంఎంటీఎస్ రైలులో ప్రయాణికుడి సెల్‌ఫోన్లను లాక్కొని దొంగలు పారిపోయారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పీతాంబర్ లాయక్ (31) నగరంలో కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉందానగర్ నుంచి సికింద్రాబాద్‌కు ఎంఎంటీఎస్ రైలులో వెళ్తుండగా ఆర్ట్స్ కళాశాల - సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ల నడుమ నలుగురు గుర్తుతెలియని దొంగలు లాయక్‌పై దాడి చేసి అతని వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లను లాక్కొని పారిపోయారు. లాయక్ సికింద్రాబాద్ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేయగా అక్కడి నుంచి కాచిగూడ రైల్వే పీఎస్‌కు బదిలీ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


సీనియర్ పోలీస్ అధికారులు, పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోలతో నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న చిక్కడపల్లి పోలీస్ సబ్‌డివిజన్ ఏసీపీ ఎల్. రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ - చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి

ఓటర్లను బెదిరించిన కేంద్రమంత్రిపై చర్యలు తీసుకోవాలి

● అంబర్‌పేట పీఎస్‌లో మాజీ ఎంపీ. వి.హనుమంతరావు ఫిర్యాదు


సీఐ కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు అందజేస్తున్న మాజీ ఎంపీ హనుమంతరావు

అంబర్‌పేట : త్వరలో జరగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లను బెదిరించిన కేంద్ర మత్స్య పశుసంవర్థక, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ అలియాస్ లలన్‌సింగ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు కోరారు. ఈ మేరకు బుధవారం అంబర్‌పేట పీఎస్‌లో సీఐ కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. రాబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మోకామ నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఓటర్లు ఓటు వేయకుండా అడ్డుకోవాలని తమ పార్టీ కార్యకర్తలకు ఆయన చెప్పినట్లుగా ఉన్న వీడియో వైరల్ అయిందని వీహెచ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతే కాకుండా ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలను ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా నిర్బంధించాలని సూచించినట్లు వీడియోలో ఉందన్నారు. దీనిపై పాట్నా జిల్లా మెజిస్ట్రేట్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీడియో ఫుటేజీ పరిశీలించి కేంద్ర మంత్రిపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సూచించినట్లు వీహెచ్ ఫిర్యాదులో తెలిపారు. దీనిపై కేంద్రమంత్రిపై ఎఫ్ఐఆర్ నమోదు అయిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పుల్లా నారాయణస్వామి, దిడ్డి రాంబాబు, కాంగ్రెస్ నాయకుడు తొలుపునూరి కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

